# పుత్రోత్సాహం బ్యాంక్‌లో వేశాను

"మధ్యాహ్నం నుంచీ నీకోసం తిరుగుతున్నాను నాన్నా! ఎక్కడికెళ్ళిపోయావు? ఆఫీసులో లేవు, క్లబ్బులో లేవు, వెంకటేశ్వర రావు గారింటో లేవు!" అని విసుక్కున్నాడు మా అబ్బాయి. రాత్రి పదిగంటలకి నే నింటికి చేరగానే.

"ఏమంత ముంచుకుపోయే పనొచ్చింది, నాతో?" అని చిరాకు పడ్డాను.

"కాలేజీ కమిటీ చేర్మన్‌గారు రేపు పుదయం బొంబాయి వెళ్ళిపోతారుట, ఇవాళ రాత్రి ఆ లెక్చరర్ ఉద్యోగాలకి ఎవరెవర్ని వెయ్యాలో తేల్చేస్తున్నారు. ఆయన్తో మాట్లాడతానన్నావుగా?"

"అంతకంటే మంచి ఉద్యోగం ఒకటి నీకిప్పించడానికి తిరిగేను ఇవాళ."

"ఏమిటో ఆ పుద్యోగం" అని వ్యంగ్యంగా పళ్ళికిలించాడు.

"గుర్తులేదా? ఆ బ్యాంక్ కాషియర్ పోస్టుకి పెట్టావుగా అప్లికేషన్! సుఖాడియా అని, రీజినల్ మేనేజర్ ఇవాళ యిక్కడి కొచ్చాడు.

ఆయనా, నేనూ బెనారస్‌లో క్లాస్మేట్సుం. నీ గురించి ఆయనతో చెప్ప డానికి.''

''పోనీ నాన్నా! దిక్కుమాలిన బ్యాంకు ఉద్యోగం ఎవడిక్కా వాలి? ఎమ్మెస్సీ పాసై బ్యాంకులో డబ్బు లెఖ్ఖపెడుతూ కూర్చోనా?'' అన్నాడు వాడు ఈసడింపుగా.

''ఏం ఎమ్మెస్సీవో, గట్టిగా పావుగంట మాట్టాడలేవు సబ్జక్టు మీద. పోనీ, పదిహేను లైన్లు తప్పుల్లేకుండా రాయలేవు. మీ తరం పోస్టుగ్రాడ్యుయేట్లకి తాలూకాఫీసు గుమస్తా పనికూడా చెయ్యడం రావట్లేదు!" అన్నాను.

"అయినా బ్యాంక్‌లో ఎవడు చేస్తాడు నాన్నా! జీతాలు తక్కువ, డి. ఏ. లు తక్కువ, మెడికల్ బిల్సు తక్కువ, ఓవర్ టైములు వుండడంలేదు!"

"మిగిలిన ప్రపంచం ఎలావుందో చూడు. గవర్నమెంటు ఉద్యోగస్తులకంటె, చాలా ప్రయివేట్ కంపెనీ ఉద్యోగస్తుల కంటె బ్యాంకు గుమస్తాల పని బావుందిగా!" అన్నాను.

''బావుందనుకో—''

''ఏటిక ఏడాదీ కష్టపడే రైతుకంటె, స్వయం ఉపాధితో బ్రతికే చిరువ్యాపారికంటె, పత్రికా సంపాదకులకంటె, ఇలా చాలామంది కంటె బ్యాంకు వాళ్ళపని బావుంది కదా! అదీకాక, ప్రొమోషన్లు బ్యాంకుల్లో వచ్చినంత సుళువుగా మరెక్కడా రాడంలేదుగా? ఇవాళ నువ్వు గుమాస్తాగా జాయినై, అచ్చుఫారాలు నింపుకుంటూ డ్యూటీ చేసేస్తే పదేళ్ళలో మేనేజర్ అయిపోతున్నావు. ఇంకా ఎందుకు బ్యాంక్ ఉద్యోగానికి వంకలు పెట్టడం!'' అన్నాను ఘాటుగా.

''నువ్వెప్పుడూ ఇంతే నాన్నా!'' అని దుప్పటి ముసుగెట్టి పడుకున్నాడు మా నాని.

పదిరోజులైంది. సుఖాడియాగారి నుంచి ఉత్తరం వచ్చింది. "నువ్వు చెప్పిన కాండిడేటు-సారీ, మీ అబ్బాయేగా! అయినా అతన్ని నేను కాండిడేట్ అంటాను- మా వాళ్ళు పెట్టిన రాత పరీక్షలో రాష్ట్రం మొత్తంమీద పన్నెండోవాడుగాను, ఇంటర్వ్యూలో ఎనిమిదో వాడుగాను వచ్చాడు. అంచేత నువ్వు కలగజేసుకోకపోయినా ఆ కేషియర్ జాబ్ అతనికి ఇవ్వక తప్పదు నాకు. ఇందుతో ఆర్డర్ పంపిస్తున్నాను. వెంటనే డిపాజిట్ కట్టించి జాయిన్ చెయ్యి. నీ సదుపాయం కోసం అతన్ని మీ ఊరి బ్రాంచిలోనే వేస్తున్నా."

మళ్ళీ ఏం తగాదా పెడతాడో కొడుకు అని భయపడుతూ ఇంటికి చేరాను. మావాడు నన్ను చూడగానే "ఇదుగో నాన్నా! జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చింది" అని కాలేజి కమిటీ వారి ఆర్డర్ చూపించాడు.

"పోనీలే, వాడికి ఏది ఇష్టమైతే అదే చేస్తాడు. సుఖాడియాకి ఎపాలజీ రాస్తాను" అన్నాను ఆ రాత్రి మా ఆవిడతో.

మరి ఈ సంగతి వాడికెలా తెలిసిందో, పొద్దుటే లేచి "నాన్నా! డిపాజిట్ కట్టడానికి డబ్బుకి చెక్కు రాయనా!" అన్నాడు.

"అంటే?" అన్నాను.

"రాత్రంతా ఆలోచించాను. లెక్చరర్‌గా కుర్రాళ్ళతో అవస్థలు పడేకన్నా బ్యాంక్ కాషియర్‌గా కస్టమర్స్‌తోనే బావుంటుంది. పైగా దేశ స్థాయిని సమ్మె జరుగుతోంది. బ్యాంక్ ఉద్యోగుల పరిస్థితులు ఐక్య సంఘటన ద్వారా యింకా మెరుగవుతాయి. నేను బ్యాంక్‌లో జాయినవడానికే నిశ్చయించాను!" అన్నాడు మా అబ్బాయి.

వాడి దూరదృష్టికి సంతోషించక తప్పలేదు. ఆ పుత్రోత్సాహంలో, నాకు.

(20-1-79)